76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21

Dr. DWIBHASHYAM KASI VISHWANATH TEJASWI
ఏపీలో ప్రఖ్యాతిగాంచిన చింతలూరు ఆయుర్వేద వైద్యులు,
సంతానరాహిత్య సమస్యలకు సంప్రదించండి
ph : 90329 90138, 93939 90138
email :dr.d.vishwanath@gmail.com
AYYAPPA AYURVEDIC SYNDICATE
Visakhapatnam

# రాజధాని వార్తలు

Voice of Voiceless

రాజధాని వార్తలు దినపత్రికలో
పనిచేయుటకు సబ్ ఎడిటర్లు, రాష్ట్రవ్యాప్తంగా ఎడ్వర్టైజ్‌మెంట్
ఎగ్జిక్యూటివ్, రిపోర్టర్‌లు కావలెను
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన
జీతం ఇవ్వబడును.
76809 94755
rajadhanivartalu1@gmail.com


అమరావతి సంపుటి : 4 సంచిక 22, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 18 - ఆదివారం 24 ఫిబ్రవరి, 2019

విశేషాలు 2లో...



మారణ హోమాలకు అంతం ఎన్నడు ?

విశేషాలు 3లో...



బైక్ విన్యాసాల భామ

విశేషాలు 4లో...



రాఫెల్ గుట్టు 'ది హిందూ' రట్టు

విశేషాలు 4లో...

తెలుగు

తెలుగు భాషకు అంతర్జాతీయ గౌరవం..







వైసీపీ అధినేత జగన్‌ని కలిసి పార్టీలో చేరిన ఆమంచి కృష్ణమోహన్, మేడా మల్లికార్జునరెడ్డి, జై రమేష్

# వైసీపీలోకి వలసల వెల్లువ

## మరో 30 మంది చూపు ?



**రాజధాని వార్తలు డెస్క్, అమరావతి :** అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ వలసలు వెల్లువెత్తుతున్నాయి. నిన్నటివరకు విపక్షం నుంచి అధికార పక్షంలోకి జంపింగ్‌లు జరగ్గా, ఎన్నికల ముందు అధికార పక్షం నుంచి విపక్షంలోకి జరగడం విశేషం. అంతకు ముందు సీఎం చంద్రబాబు చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌తో వైసీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు, ముగ్గురు ఎంపీలు పార్టీ ఫిరాయించారు. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ టీడీపీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన చీరాల ఎమ్మెల్యేల ఆమంచి కృష్ణమోహన్ టీడీపీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైసీపీలోకి చేరగా, ప్రముఖ పారిశ్రామిక వేత్త దాసరి జైరమేష్ కూడా ఆ జాబితాలో చేరారు. గుంటూరు ఎంపీ స్థానాన్ని ఇవ్వకుండా విజయవాడను కేటాయించారని అలిగిన ఘట్టమనేని ఆదిశేషగిరిరావును జాగ్రత్తగా హ్యాండిల్ చేసి బుద్దా వెంకన్న టీడీపీలోకి తేవడంలో కృతకృత్యులయ్యారు. విజయవాడ ఎంపీ సీటును విజయ ఎలక్ట్రికల్ అధినేత జైరమేష్‌కు కేటాయిస్తారని తెలుస్తోంది. తాజాగా మాజీ డీజీపీ నండూరి సాంబశివరావు కూడా లైన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పార్టీ జంపింగ్ లు ఇంతటితోనే అయిపోలేదని - ఇది కేవలం టీజర్ లాంటిదేనన్న వాదన వినిపిస్తోంది.

ఐదేళ్ల పాలనలో చంద్రబాబు సాగించిన నత్తనడక పాలన - ఆశ్రితపక్షపాతం - రాష్ట్రాన్ని అప్పుల కుప్పలో కూరుకుపోయేలా చేయడమే ఇందుకు కారణాలని తేల్చేసుకున్న టీడీపీ నేతలు ఇప్పుడు వైసీపీలోకి చేరిపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అప్పట్లో పెద్ద ఎత్తున డబ్బు - అధికార పార్టీగా మంత్రి పదవులు - ఇతర అభివృద్ధి పనులను ఆశగా ఎరవేసి చంద్రబాబు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తే... వచ్చే ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఉన్న సీటులో అవకాశం ఇస్తే చాలంటూ జగన్ వద్దకు టీడీపీ నేతలు క్యూ కడుతున్నారు. అంతేకాకుండా వైసీపీ టికెట్ తో వచ్చిన పదవిని వదులుకునేందుకు నాడు టీడీపీలో చేరిన ఎమ్మెల్యేలు ససేమిరా అంటే... ఇప్పుడు టీడీపీ టికెట్ తో వచ్చిన పదవిని తృణప్రాయంగా వదిలేస్తూ వైసీపీలోకి చేరిపోతున్నారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి ఓ నలుగురైదుగురు టీడీపీ ప్రజా ప్రతినిధులు వైసీపీలోకి చేరిపోయేందుకు రెడీ అయిపోయినట్టుగా తెలుస్తోంది. ప్రకాశం జిల్లా నుంచి కూడా ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు వైసీపీలోకి వచ్చేందుకు సిద్ధమయ్యారని, ఇదే జిల్లాకు చెందిన ఓ సీనియర్ రాజకీయవేత్త - ప్రస్తుతం టీడీపీ ఎమ్మెల్సీగా ఉన్న నేత కూడా ఇదే బాటలో ఉన్నారట. గతంలో టీడీపీ బెదిరింపులు - ఇతర తాయిలాలకు తలొగ్గి ఇష్టం లేకున్నా టీడీపీలో చేరిన వైసీపీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా తిరుగుబాట పడుతున్నట్లుగా కూడా వార్తలు వస్తున్నాయి. ఇదే సమయంలో టీడీపీ సీనియర్ నేత - మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కూడా వైసీపీలో చేరే అవకాశాలున్నాయని వార్తలు వినిపిస్తున్నాయి. టీడీపీలో జరిగిన అవమానాలు - తనకు తగ్గిపోతున్న ప్రాధాన్యాన్ని తరచి చూసుకుంటున్న పల్లె వైసీపీలో చేరే దిశగా ఇప్పటికే తన యత్నాలు మొదలెట్టినట్టు తెలుస్తోంది. మొత్తంగా 30 మందికి పైగానే టీడీపీ నుంచి ప్రజాప్రతినిధులు వైసీపీలో చేరిపోవడం ఖాయమేనన్న వార్తలు ఇప్పుడు చంద్రబాబును తీవ్ర కలవరానికి గురి చేస్తున్నాయని తెలుగు వార్తల వెబ్‌సైట్లు తెలుపుతున్నాయి. మాజీ సాంబశివరావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన వైసిపి లో చేరుతారని ఆ పార్టీలోని ముఖ్యుల నుండి అందుతున్న విశ్వసనీయ సమాచారం. జగన్ పాదయాత్ర సమయంలోనే మాజీ డీజీపీ సాంబశివరావు జగన్ ను కలిసారు. ఆ సమయంలో సాంబశివరావు వైసీపీలో చేరుతున్నారనే ప్రచారం జరిగింది. కానీ, డీజీపీగా రిటైర్ అయిన తరువాత ఏపీ ప్రభుత్వం ఆయనకు గంగవరం పోర్టులో కీలక బాధ్యతలు అప్పగించింది. ఆ హోదాలో ఉన్న సమయంలోనే ఆయన జగన్ ను కలిసారు. ఆ వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు తన వద్దకు సాంబ శివరావును పిలిపించుకొని జగన్ ను కలవటం పై వివరణ అడిగారు. ఆ తరువాత తాను తమ పోర్టు పరిధిలోకి వచ్చిన ప్రతిపక్ష నేతను

- మిగతా 2 లో

## జ్యోతి హత్యకేసు..
# పట్టించిన ఫేస్‌బుక్ ?





**రాజధాని వార్తలు-మంగళగిరి :** మంగళగిరికి చెందిన జ్యోతి హత్యోదంతంలో కీలక సమాచారం లభించింది. జ్యోతి ఆమె ప్రియుడు శ్రీనివాస్‌లకు చెందిన చరవాణిలను పోలీసులు స్వాధీనం చేసుకుని కాల్‌డేటా విశ్లేషించగా ఫేస్‌బుక్ ఛాటింగ్‌లో వారి మధ్య సంబంధంపై పలు కీలక అంశాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అర్బన్ ఎస్పీ విజయరావు శుక్రవారం ఎన్నారై ఆసుపత్రిలో చుంచు శ్రీనివాస్‌ను విచారించారు. అతని తలకు మూడు రోజుల క్రితం ఎన్నారైలో శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం స్థిమితంగా ఉంది. ఉమెన్ ప్రొటెక్షన్ ఎస్పీ సరిత, అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ మధ్యాహ్నం నుంచి రాత్రి 7 గంటల వరకు శ్రీనివాస్‌ను వివిధ కోణాల్లో విచారించారు. ఈనెల 11న మంగళగిరికి సమీపంలోని ఉడాటౌన్ షిప్‌లో జ్యోతి ఆమె ప్రియుడు శ్రీనివాస్ కలిసి ఉండగా వారిపై దాడి జరగ్గా ఘటనా స్థలంలోనే జ్యోతి మ ృతి చెందిన సంగతి తెలిసిందే. జ్యోతి హత్యకు సంబంధించి ఆమె ప్రియుడు శ్రీనివాస్‌ను పోలీసులు విచారిస్తుండగా పొంతనలేని సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఆ రోజు జరిగిన దాడిలో షాక్‌కు గురయ్యానని, ఎవరో ముగ్గురు వ్యక్తులు వచ్చారని శ్రీనివాస్ చెప్పారు. వచ్చిన వారిలో ఒకరు నల్లగా ఉన్నారని, అతను తనకు తెలుసని విచారణలో చెప్పగా ఇప్పటికే ఈమేరకు వారి ముగ్గురిని విచారించారు. శ్రీనివాస్ చెప్పినట్లు అసలు వారు ఉడాటౌన్ షిప్‌కు చేరుకోవటానికి ఉన్న మార్గాలన్నింటిలో సీసీ టీవీ ఫుటేజీలు తీసి పరిశీలిస్తున్నారు. మరో వైపు జ్యోతి, శ్రీనివాస్‌ల ఫేస్‌బుక్‌లో ఉన్న సమాచారాన్ని బట్టి పరిశీలిస్తే వారి మధ్య బలమైన

- మిగతా 2 లో

# విజయవాడ ఆర్టీసీకి త్వరలో స్లీపర్ కమ్ సీటర్ బస్సులు

### ఇంధన పొదుపుతోనే సంస్థ మనుగడ



**రాజధాని వార్తలు, విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ త్వరలో స్లీపర్ కమ్ సీటర్ బస్సులను నడపనుంది. ఈ బస్సులను రాత్రిళ్లు నడుపుతామని, కూర్చొనడానికి, పడుకోవడానికి వీలుగా ఉండేట్లు వీటిని రూపొందిస్తున్నామని ఆ సంస్థ తెలియచేసింది. వీటితోపాటు మరో 80 ఏసీ ఎలక్ట్రికల్ బస్సులను తిరుమల-తిరుపతి మధ్య నడుపుతామని రాష్ట్ర రవాణా కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజనీరింగ్) ఎ. రామకృష్ణ తెలిపారు. కొత్తగా తయారైన పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులతోపాటు మరో 865 కొత్త బస్సులు ఈ ఏడాది రోడ్డెక్కనున్నాయి. వాటిలో 200 బస్సులు పల్లెవెలుగు, 50 ఎక్స్‌ప్రెస్ , 160 ఏసీ, 75 సిటీ బస్సులు ఉన్నాయన్నారు. కొత్త ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు సరకుల రవాణాకు అనుగుణంగా ఉంటాయని చీఫ్ మెకానికల్ ఇంజనీర్ పి. కృష్ణమోహన్ తెలిపారు. 75 సిటీబస్సులను విజయవాడ, విశాఖల్లో ఉపయోగిస్తారని, వెన్నెల, ఇంద్ర బస్సులను కూడా కేటాయిస్తున్నామని, 160 కొత్త ఏసీ బస్సులతో వాటి సంఖ్య 290కి పెరుగుతుందన్నారు. ఇంధన పొదుపు మాసోత్సవాల సందర్భంగా జనవరి 16 నుంచి ఫిబ్రవరి 16 వరకు ఏపీ రోడ్డురవాణా సంస్థ పలు కార్యక్రమాలను చేపట్టింది. విజయవాడ కేంద్రంగా రాష్ట్రం, పక్కరాష్ట్రాలకు 12 వేల బస్సులను సంస్థ నడుపుతోంది. ఇందుకోసం రోజుకు 8 లక్షల లీటర్ల డీజిల్ వినియోగిస్తున్నారు.

ఇంధన పొదుపు మాసోత్సవాల సందర్భంగా ' చమురు, గ్యాస్ పొదుపులో డ్రైవర్ల పాత్ర'పై రాష్ట్రవ్యాప్తంగా వ్యాసరచన పోటీలు నిర్వహించామని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నవారికి బహుమతులు అందచేస్తామని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజనీరింగ్) ఎ. రామకృష్ణ తెలిపారు. కార్పొరేషన్ ఏడాదికి రూ. 1,200 కోట్లను ఇంధనంపై ఖర్చుచేస్తోందన్నారు. ప్రస్తుతం 5.20 కేఎంపీఎల్‌తో ఏపీఎస్‌ఆర్టీసీ వినియోగిస్తుందన్నారు. ఇంధనం పొదుపుగా వాడి కాలుష్యాన్ని తగ్గించాలని ఆయన పిలుపునిచ్చారు. తరచుగా చమురు రేట్లు పెరగడం వల్ల ఆర్టీసీ నష్టాల్లోకి వెళుతుందని, విద్యుత్, గ్యాస్, సోలార్, వాహనాల వినియోగంతో ఇంధనం పొదుపుకు చర్యలు చేపట్టామని రామకృష్ణ వెల్లడించారు.

# వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా పృధ్వీరాజ్



**రాజధాని వార్తలు- అమరావతి :** కృష్ణాజిల్లాకు చెందిన సినీనటుడు పృధ్వీరాజ్ వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. కొంతకాలంగా వైసీపీ కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొంటూ, సంఘీభావం తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు కీలక పదవి దక్కింది. ఏపీ ప్రధాన ప్రతిపక్ష నేత వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇటీవల నిర్వహించిన సుదీర్ఘ పాదయాత్రలో కూడా పృధ్వీ పాల్గొన్నారు. దీంతో పాటుగా వైసీపీ ముఖ్యనేత - ఎంపీ విజయసాయిరెడ్డి

- మిగతా 2 లో




## రేపు ఏలూరులో జరగనున్న
# వైసీపీ బీసీ గర్జన



**రాజధాని వార్తలు, అమరావతి :** రేపు ఏలూరులో జరగనున్న వైసీపీ బీసీ గర్జన బహిరంగ సభను విజయవంతం చేయవలసిందిగా విజయవాడ పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు దుర్గారావు అన్నారు. శనివారం నాడు మీడియా హౌస్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ బహిరంగ సభకు సుమారు లక్షకు పైగా బీసీలు రానున్నారని రాబోయే రోజుల్లో బీసీ లందరూ జగన్ కు మద్దతు పలకనున్నట్లు దుర్గారావు తెలిపారు. ఈ సభలో వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి బీసీ డిక్లరేషన్ పై ప్రకటన చేయనున్నారని దుర్గారావు అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ అభ్యర్థులను 2019 ఎన్నికల్లో ఎక్కువ సీట్లు ఇచ్చే పార్టీ కూడాను వైసిపి నని ధీమా వ్యక్తంచేశారు. బీసీ గర్జన సభకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తమ ఆధ్వర్యంలో ఎక్కువ సంఖ్యలో బీసీలు ఈ సభలో పాల్గొని జయప్రదం చేయనున్నారని దుర్గారావు తెలిపారు. ఈ సమావేశంలో బి సి సి టి సెల్ అధ్యక్షుడు రాజేష్ కోటేశ్వరావు బిసి ఐక్యవేదిక తదితరులు పాల్గొన్నారు. బిసి గర్జనకు సంబంధించి గోడ పత్రికను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

# జవాన్ల కుటుంబాలకు ఆర్థిక సాయం

### ఒక్కో అమర జవాను కుటుంబానికి రూ. 5 లక్షలు



**రాజధాని వార్తలు, విజయవాడ :** పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్ల కుటుంబాలకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ గ్రేషియాను ప్రకటించారు. ఒక్కో అమర జవాను కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని ఇవ్వనున్నట్టు తెలిపారు. అమరుల త్యాగాలను జాతి ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని చెప్పారు. జవాన్ల కుటుంబాలకు అందరూ అండగా నిలవాలని కోరారు. ఉగ్రవాదాన్ని అణచివేయడంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా ఏపీ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటివి చోటు చేసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్కా వ్యూహాన్ని అనుసరించాలని అన్నారు. ఉగ్రదాడిలో ఇంత మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని చెప్పారు.

# ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో 175 సీట్లలో గెలుస్తాం..

### పులివెందుల కూడా మాదే!: మంత్రి నారా లోకేశ్ ధీమా



**రాజధాని వార్తలు, విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ఐటీ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్ ఈరోజు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 175 స్థానాల్లో టీడీపీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఏపీలోని 175 నియోజకవర్గాలకు పెన్షన్ ఇస్తున్నాం. అన్ని నియోజకవర్గాల్లో రైతన్నల రుణమాఫీ చేశాం. 175 నియోజకవర్గాల్లో డ్వాక్రా

- మిగతా 3 లో

రాజధాని వార్తలు
కలం

## దొంగలు పడిన ఆర్నెల్లకు..

దొంగలు పడిన ఆర్నెల్లకు ..చందంగా ఉంది చంద్రబాబు ప్రత్యేక హోదా నినాదం. వైసీపీ, వామపక్షాలు, కాంగ్రెస్, ప్రత్యేక హోదా సమితి ఇవన్నీ ఎప్పటి నుంచో పోరాడుతుంటే సార్వత్రిక ఎన్నికలకు పట్టుమని మూడు నెలలు కూడా లేని సమయంలో ఆయన ధర్మపోరాట దీక్షను ఢిల్లీలో మొదలు పెట్టడం ప్రజలను మభ్య పెట్టేందుకే అని చెప్పక దప్పదు. అప్పట్లో గుంటూరులో వైసీపీ అధినేత దీనిపై నిరాహార దీక్ష చేస్తే అసలు పట్టించుకోని చంద్రబాబు రాజధాని నిర్మాణంలో మునిగిపోయి, రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారని ప్రతిపక్షంపై విరుచుకు పడ్డారు ..అంతేకాదు.. ప్యాకేజీని ఆయనతోపాటు మంత్రివర్గం కూడా బలంగా ముందుకు తెచ్చాయి. అందుకు అసెంబ్లీలో ధన్యవాదాలు కూడా సమర్పించి కేంద్రానికి పంపాయి. అదేమన్నా.. సంజీవనా.. అన్ని సమస్యలు తీరుతాయా ? అని ఇంకా చెప్పాలంటే ప్రత్యేక హోదా ప్రకటించి, నిధులు కేటాయించకపోతే పరిస్థితి ఏంటని అన్నారు.. హోదా అంటే జైలుకే అని కూడా అన్నారు. హోదా కోసం పోరాడిని విద్యార్థులు, నిరుద్యోగులపై పోలీసు బలగాలు ప్రకటించి నిర్ధాక్షిణ్యంగా అణచి వేయడమే కాకుండా,వారిమీద కేసులు నమోదు చేశారు.

వాస్తవానికి గతేడాది కేంద్ర బడ్జెట్ ప్రవేశం తర్వాత ఏపీకి నిధులు కేటాయించకపోవడంపై వామపక్షాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ బంద్‌కు అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్యంగా మద్దతు లభించింది. దీంతో చంద్రబాబు కొద్దికొద్దిగా ఎన్‌డీఏ నుంచి పక్కకు జరగడం ప్రారంభించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు దగ్గరయ్యారు. రాహుల్‌ను ప్రసన్నం చేసుకుంటంలో విజయం సాధించడంతో ఎన్‌డీఏపై విమర్శలకు పదును పెంచారు. దీనిలో భాగంగానే ప్రతి జిల్లాలోనూ ధర్మపోరాట దీక్షలు మొదలు పెట్టి ప్రజాధనాన్ని దుబారా చేస్తున్నారు. 2015లో వైసీపీ నల్లచొక్కాలతో నిరసన తెలిపి, రాష్ట్రపతికి మెమోరాండం సమర్పించింది. 2016లోనే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రపతిని కలసి విజ్ఞప్తి చేసింది. విషయం ఏమంటే వీటన్నింటికి ఒక వర్గం మీడియా అసలు ప్రచారం కల్పించనేలేదు. అఖిల పక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలని వామపక్షాలు నెత్తీనోరూ కొట్టుకున్నా పట్టించుకోని చంద్రబాబు అసెంబ్లీ ఎన్నికల ముందు ఢిల్లీలో ధర్మపోరాటం మొదలు పెట్టారు. దీంతో వారంతా ఛీ కొట్టారు. ఒకవైపు నిధులురాక,మరోవైపు తీవ్ర దుర్భిక్షంతో రైతులు, ఉద్యోగాల నియామకాలు జరక్క నిరుద్యోగులు, పనికి హామీ పథకంలో చెల్లింపులు జరపక పోవడంతో కూలీలు, వినోద కార్యక్రమాలు (ఫెస్ట్) తప్ప, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించకుండా అగచాట్లకు గురిచేస్తున్న ప్రభుత్వం ఆఘమేఘాల ఢిల్లీలో ధర్మ పోరాటానికి నిధులు మంజూరుకు జీవోలు విడుదల చేయడం గమనార్హం.

చంద్రబాబు నాయుడు 12 గంటల దీక్షకు రూ.11 కోట్లు ఖర్చు చేశారని వార్తలు వచ్చాయి. ఫిబ్రవరి 11 ఉదయం 8 గంటలకు ప్రారంభమైన దీక్ష రాత్రి 8 గంటలకు ముగిసింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.11.12 కోట్లను కేటాయించింది. ఫిబ్రవరి 6న రూ. 10 కోట్ల కోసం ఏపీ ఆర్థిక శాఖ జీవో నెంబరు 215 విడుదల చేసింది. సాధారణ పరిపాలన (ప్రొటోకాల్) విభాగం అదే రోజు జీఓ 262ను విడుదల చేసింది. ముఖ్యమంత్రి ఒకరోజు దీక్షకు గాను ఆసక్తికలిగిన రాజకీయ పార్టీలు, సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతరులను తీసుకెళ్లేందుకు గాను అనంతపురం, శ్రీకాకుళంల నుంచి 20 బోగీలు ఉన్న రెండు ప్రత్యేక రైళ్ల సేవలను ఉపయోగించుకునేందుకు రూ.1,12,16,465 కేటాయిస్తున్నట్లు అందులో పేర్కొంది. ఐదునక్షత్రాల హోటల్ కోసం, 60 ఏసీబస్సులు, పెద్ద హోటళ్లలో 2000 రూముల కోసం నిధులు ఖర్చుచేసి ఆఖరి పోరాటాలు చేయడం అవసరమా ? చేతులు కాలాక ఆకులు పుచ్చుకున్నా ప్రయోజనం ఏమిటి ?

# మారణహోమాలకు అంతం ఎన్నడు ?





పుల్వామాలో జరిగిన భీకర దాడిలో పెద్ద సంఖ్యలో భారత జవాన్లు అసువులు బాసిన ఘటన ఈ ప్రశ్నను మరోసారి తెరపైకి తెచ్చింది.70 వాహనాల్లో 2,547 మంది జవాన్లు తెల్లవారు జామున బయలుదేరి సాయంత్రానికల్లా కాశ్మీర్ చేరుకునేందుకు వెళుతుండగా జరిగిన ఈ భీకర దుర్ఘటన గుండెలను పిండేస్తుంది.మరణ సంఖ్యరీత్యా మూడు దశాబ్దాల తర్వాత కాశ్మీర్‌లో జరిగిన అతిపెద్ద దాడి. 2001లో జైష్-ఎ-మొహ్మద్‌కు చెందిన ఆత్మాహుతి దళం శ్రీనగర్ సచివాలయం వెలుపల కారుబాంబుతో దాడి చేసి 38 మంది ప్రాణాలు తీసింది.2002 మే 14న కలూచక్ ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడిలో 12 మంది పౌరులతోపాటు 22 మంది సిపాయిలు హతులయ్యారు. 2014 డిసెంబరులో 9 మంది సిపాయిలు హత్యకు గురికాగ, 2016లో యూరీ సైనిక స్థావరంపై పాకిస్థాన్ నుంచి చొరబడిన ఉగ్రవాదుల చీకట్లో మాటు వేసి జరిపిన దాడిలో 18 మంది సైనికులు మృతి చెందారు.2017 డిసెంబరు ఎదురుకాల్పుల్లో 8 మంది మరణించారు.కార్గిల్ యుద్ధం నుంచి ఇప్పటివరు 110 ఉగ్రదాడులు జరిగాయి.

అయితే.. దాడికి పాల్పడిన విధానం, జరిగిన నష్టం విషయంలో మాత్రం గతంలోని అన్ని దాడుల కంటే కూడా ఇది చాలా తీవ్రమైనదనే చెప్పాలి.దాడి జరిగిన వెనువెంటనే రాజకీయ నాయకులు, అధికారులు అంతా దాడిని ఖండిస్తూ ప్రకటనలు చేశారు. ప్రతీకారం తీర్చుకోవాల్సిందేనన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

**కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, జనరల్ వి.కె.సింగ్(మాజీ ఆర్మీ చీఫ్) "ఉగ్రవాదులకు మర్చిపోలేని గుణపాఠం చెబుతాం" అన్నారు.అధికార స్థానాల్లో ఉన్నవారు చేసే ఇలాంటి వ్యాఖ్యలు.. కశ్మీర్ సమస్యపై ఉన్న అవగాహన లేమి, లోపభూయిష్ట పరిష్కారాలను పదేపదే వల్లించే తీరును మరోసారి బయటపెడుతున్నాయి. ఇలాంటి ఘటనల సమయంలో సైనికుల పరాక్రమాన్ని ఘనంగా చూపుతూ బాధ్యతల నుంచి తప్పుకొనే ధోరణికీ ఇది నిదర్శనం.సరిహద్దుల్లోను, కుట్రదారులతోనూ పోరాడటం సైనికుల బాధ్యత అయితే... ఇలాంటి హింసాత్మక పరిస్థితులను తప్పించాల్సిన నైతిక బాధ్యత రాజకీయ నాయకులది.** కానీ, క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు ఇలాంటి బాధ్యతాయుత పాత్రను ప్రస్ఫుటంచేయలేక పోతున్నాయి.ఏమాత్రం ఆలస్యం లేకుండా, ఏ ఒక్క కోణాన్నీ విడిచిపెట్టకుండా ఈ కేసులో దర్యాప్తు చేయడం అత్యవసరం. దీని వెనుక ఉన్న మాస్టర్ మైండ్స్ ఎవరు? అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉన్న రహదారిలో ఇలాంటి దాడి జరిగిందంటే లోపమెక్కడ ఉంది? అనే కోణాల్లోనూ దర్యాప్తు చేపట్టాల్సి ఉంది. **అయితే, బాధ్యతాయుతమైన ప్రజాస్వామ్య రాజ్యాల నుంచి రాజకీయంగా కానీ, చర్యలపరంగా కానీ ప్రతీకార విధానాలను ఆశించరాదు. ప్రతీకార దాడుల వల్ల కేవలం మరింత రక్తం చిందుతుంది..** దాని వల్ల కశ్మీర్ లోయ, భారతావనికి నష్టం కలిగే ప్రమాదమూ ఉంది.కాబట్టి, దీనికి బదులుగా.. కశ్మీర్ లోయలో సైనికులు, రాజ్యేతర సాయుధ శక్తులు, పౌరులు ప్రాణాలు ఎందుకు బలవుతున్నాయన్న ప్రశ్న వేసుకోవాలి. అంతేకాదు, ఈ పరిస్థితులకు ముగింపు పలికేందుకు ఎలాంటి పరిష్కారం చూపాలన్నదీ ఆలోచించాలి. **కశ్మీర్‌లో మిలిటెన్సీని రూపుమాపే విధానాలు అనుసరించడానికి బదులు మిలిటెంట్లను హతమార్చి విజయోత్సవాలు చేసుకోవడమనేది పెరగడంతో... ప్రతిగా యువత ఆయుధాలు పట్టి భారత భద్రతాదళాలతో పోరాడడమనేదీ పెరిగిపోయింది.ఇక్కడ మిలిటెన్సీ అనేది కశ్మీర్ సమస్య వేర్లలోంచి పుట్టిన ఒక మొక్క. ఇదొక అపరిష్కృత రాజకీయ వివాదం. ప్రజాస్వామిక హక్కుల విధ్వంసానికి, మానవ హక్కుల హననానికి ఇదొక నిదర్శనం. ఈ విషయంలో రాజకీయ చొరవ లేకుండా ఎలాంటి** సైనిక ప్రయత్నం చేసినా అది తప్పుడు మార్గంలో **వెళ్లినట్లే.** ఏడు దశాబ్దాల్లో.. ముఖ్యంగా తిరుగుబాటు మొదలైన 1990ల నుంచి కశ్మీర్ వివాదం విషయంలో అన్ని ప్రభుత్వాలదీ ఒకే తీరు. కేంద్రంలోని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం సంక్షోభ పరిష్కారం దిశగా కాకుండా.. విరామం లేకుండా సాగిస్తున్న సైనిక విధానం ద్వారా సంక్షోభం మరింత ముదిరేలా వ్యవహరిస్తోంది.2016 నుంచి కశ్మీర్ ప్రజల విషయంలో బుల్లెట్లు, పెల్లెట్లు, దాడులు, విరుచుకుపడడాలు, అరెస్టులే ఏకైక విధానంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది.ఇలాంటి విధానం హింసాకాండను కానీ మిలిటెన్సీని కానీ ఆపలేదు. 2018లో 250 మంది మిలిలెంట్లను హతమార్చగా అంతకంటే ఎక్కువ మంది కొత్తగా తుపాకులు పట్టారు.పాతుకుపోయిన ఈ సమస్యను పరిష్కరించడానికి శాంతియుత మార్గంలో గట్టి ప్రయత్నాలు చేస్తే తప్ప కశ్మీర్ లోయలో రక్తపుటేరులు ఆగవు.

అఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లతో చర్చలకు ప్రపంచ దేశాలు చూపిన మార్గానికి భారత్ కూడా మద్దతిచ్చింది. అలాంటప్పుడు కశ్మీర్ విషయంలో మాట్లాడడానికి భారత్ ఎందుకు ఊగిసలాడుతుంది?ఈ సమస్య పరిష్కారానికి సరికొత్త మార్గాలు అన్వేషించాల్సి ఉంది. అలాగే, పాకిస్తాన్‌తో సంబంధాలు మెరుగుపరుచుకోవడం.. పాకిస్తాన్, జమ్ముకశ్మీర్ ప్రజలతో ఒకేసారి చర్చలు జరపడం వంటివి అవసరం.ఈ విషయంలో భారత్ ఉత్తర ఐర్లాండ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి. ఉత్తర ఐర్లాండ్ రక్తసిక్తంగా మారినప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం స్నేహపూర్వక విధానాలతోనే సమస్యను పరిష్కరించింది.పుల్వామా దాడి ఒక హెచ్చరిక. మిలిటెన్సీలోని కొత్త ధోరణులను ఇది సూచిస్తోంది. గత ఘటనలకు భిన్నంగా జరిగిన ఈ భీతావహ దాడి.. కశ్మీర్ విషయంలో అనుసరిస్తున్న లోపభూయిష్ట విధానాలు మానవ హననమనే సుడిగుండంలోకి నెడుతున్న సంగతి స్పష్టం చేసింది.

**- అనురాధ భాసిన్ జమ్వాల్**
**'కశ్మీర్ టైమ్స్' ఎగ్జిక్యూటివ్ ఎడిటర్**

## జ్యోతి హత్యకేసు.. పట్టించిన ఫేస్‌బుక్ ?

**(మొదటిపేజీ తరువాయి)**

సంబంధం ఉందని భావిస్తున్నారు. కీలకమైన ఒక ప్రశ్నకు శ్రీనివాస్ సమాధానం ఇవ్వకుండా చాలా గోప్యంగా ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**బస్టాండ్ నుంచి నూడిల్స్ పాయింట్‌కు..**

హత్య జరిగిన రోజు జ్యోతి, ఆమె స్నేహితురాలైన విజయవాడకు చెందిన వివాహిత ఒకరు గుంటూరు వచ్చి విద్యార్హత పత్రాలు తీసుకుని వేర్వేరు బస్సుల్లో వెళ్లిపోయారని పోలీసులు గుర్తించారు. ఈ హత్యకేసులో స్నేహితురాలి పాత్రకు సంబంధించి పోలీసులకు సమాచారం లభించలేదు. మంగళగిరికి జ్యోతి బస్సులో వెళ్లింది. బస్టాండ్ నుంచి ఆమెను ప్రియుడు శ్రీనివాస్ తన మోటారు బైకుపై ఎక్కించుకుని ఓ నూడిల్స్ పాయింట్‌కు వెళ్లినట్లు పోలీసులు సీసీ ఫుటేజీలు సేకరించారు. ఈ కేసుకు సంబంధించి దోషులను కఠినంగా శిక్షించాలని పోస్టు మార్టం వ్యవహారంలో పోలీసు, వైద్యుల తప్పిదంపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట జ్యోతి కుటుంబీకులతో పాటు వారి బంధువులు, ఓ రాజకీయ పార్టీకి చెందిన వారి సామాజికవర్గం ప్రతినిధులు ఆందోళన చేశారు. ఈ కేసు దర్యాప్తును పారదర్శకంగా చేపట్టాలని తమ అమ్మాయిని హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని జ్యోతి తల్లిదండ్రులతో పాటు ఆమె సోదరుడు శుక్రవారం రాత్రి అర్బన్ జిల్లా ఎస్పీ విజయారావును ఆయన ఛాంబర్‌లో కలిసి కోరారు.

**మాకు రక్షణ కల్పించండి : శ్రీనివాస తల్లిదండ్రులు**

తమ ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని తమకు రక్షణ కల్పించాలని చుంచు శ్రీనివాస్ తల్లిదండ్రులు నరసింహారావు, లక్ష్మీకుమారి పోలీసులను కోరారు. ఈ ఘటన జరిగినప్పటి నుంచి తాము ఎన్నారై ఆసుపత్రిలోనే ఉంటున్నామన్నారు. శస్త్రచికిత్స నిమిత్తం లక్ష రూపాయలు ఖర్చయిందని, తాడేపల్లిలోని ఇంటి వద్దకు జ్యోతి బంధువులు వచ్చి తమను చంపేస్తామని పెద్దగా కేకలు వేస్తూ వెళుతున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన రోజు ఉదయం 9 గంటలకు బయటకు వెళ్లి మధ్యాహ్నం 1 గంటకు శ్రీనివాస్ వచ్చాడని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎవరో ఫోన్ చేస్తే బయటకు వెళ్లాడన్నారు. రాత్రి 7 గంటల సమయంలో శ్రీనివాస్‌కు తాను ఫోన్ చేసినట్లు ఫోన్ ఎత్తిన శ్రీనివాస్ తనను ఎవరో కొట్టారని, తల పగిలిందని చెప్పాడని తండ్రి తెలిపారు.

## వైసీపీలోకి వలసల వెల్లువ

**(మొదటిపేజీ తరువాయి)**

మర్యాద పూర్వకంగానే కలిసానని.. తనకు పార్టీలో చేరే ఆలోచన లేదని చెప్పుకొచ్చారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న వేళ..ఆయన వైసీపీలో చేరుతున్నారని ఆ పార్టీ నేతలు చెప్పటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సాంబశివ రావు స్వస్థలం ప్రకాశం జిల్లా. పార్టీలో చేరుతున్న ఆళ్లగడ్డలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సుదీర్ఘకాలంగా టీడీపీలో ఉన్న ఇరిగినేని రాంపుల్లారెడ్డి సోదరులు జగన్ సమక్షంలో వైసిపి లో చేరుతున్నారు. వారు మంత్రి అఖిలప్రియ అవినీతికి పాల్పడుతున్నారంటూ అప్పట్లో సంచలన ఆరోపణలు చేసారు. టీడీపీ ఇన్‌చార్జ్‌గా పనిచేసిన ఇరిగెల పార్టీలో కీలక నేతగా ఎదిగారు. అయితే, మంత్రి అఖిలప్రియతో ఉన్న విభేదాల కారణం గా పార్టీకి దూరం జరిగారు. గతేడాది డిసెంబరు 28న టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇప్పుడు వైసీపీ లో చేరనున్నారు. ఆళ్లగడ్డలో ఇప్పటికే మంత్రి అఖిలకు వ్యతిరేకంగా టీడీపీ నేతలు ఒక్కటయ్యారు. వచ్చే ఎన్నికల్లో అఖిలకు సీటు ఇవ్వరనే ప్రచారం చేస్తున్నారు. భూమా నాగిరెడ్డి సన్నిహితుడైన ఏవీ సుబ్బారెడ్డి సైతం ఇప్పుడు భూమా అఖిలతో రాజకీయంగా తెగతెంపులు చేసుకున్నారు. దీంతో..ఆయన కూడా వచ్చే ఎన్నికల్లో అవకాశం ఇస్తే పోటీ చేస్తానని చెబుతున్నారు. ఎన్నికల వేళ..రాంపుల్లారెడ్డి సోదరులు వైసిపి లో చేరటం ఆ ప్రాంతంలో టీడీపీకి నష్టమనే చర్చ జరుగుతోంది.

## వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా పృథ్వీరాజ్

**(మొదటిపేజీ తరువాయి)**

తరఫున కూడా పలు కార్యక్రమాల్లో ఆయన భాగం అవుతున్నారు. తనదైన టైమింగ్ - రైమింగ్‌తో ఏపీ సీఎం చంద్రబాబు వైఫల్యాలను ప్రజల సమస్యలను తరచూ ఎత్తిచూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు పార్టీ కీలక పదవి దక్కింది. కాగా త్వరలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను సామాన్య ప్రజలకు తెలిసేలా వీధి నాటకాల ప్రదర్శనలు చేపడతామని ఇటీవల ప్రకటించారు. తాజా నియామకంతో కొత్త జోష్ తో పృథ్వీ వైసీపీకి మరింత ఊపును తెస్తారని భావిస్తున్నారు.




## టైల్స్ అండ్ శానిటరీ స్టోర్ ప్రారంభం



**రాజధాని వార్తలు, విజయవాడ :** నగరంలో అతి పెద్ద టైల్స్ శానిటరి షోరూమ్‌ను సాయంత్రం ప్రారంభిచినట్లు సంస్థ యజమాని ఎండీ ఉస్మాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపీలో అతిపెద్ద టైల్స్ శానిటరీకి సంబందించి ఇప్పటివరకు అంతర్జాతీయ ప్రమాణాలతో షోరూం లేకపోవడంతో చాలా వరకు హైదరాబాద్ వెళ్లి రావాల్సి వస్తుందన్నారు. అయితే ఇప్పుడు విజయవాడలో మహానాడు రోడ్డు వద్ద సుమారు 7 వేల 200 చదరపు గజాల విస్తీర్ణంలో ప్రారంభించినట్లు తెలపారు. ఇక్కడ జాతీయ అంతర్జాతీయ కంపెనీలతోపాటు స్థానికంగా లభ్యమయ్యే టైల్స్‌ను హోల్‌సేల్ ధరలకు అందించనున్నామని తెలిపారు. అంతర్జాతీయ శ్రేణులు గుర్తింపు పొందిన కంపెనీల టైల్స్ ఎగ్జిబీషన్‌ను ఈ సందర్భంగా షో రూమ్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.చిన్న చిన్న సైజు టైల్స్ నుండి పెద్ద అద్దం సైజు మాదిరి టైల్స్ కూడా ఉన్నామని తెలిపారు. ఈ మధ్యకాలంలో ఎక్కవగా వినియోగిస్తున్న ఇంటిలోనే సినిమా ధియేటర్‌కు సంబంధించి ఇంటీరియల్ ఎగ్జిబీషన్ చక్కగా ఏర్పాటు చేసుకున్న విధంగా మెటీరియల్‌ను సప్లయ్ చేయనున్నట్లు తెలిపారు. తక్కువ ధరలకు అంతర్జాతీయ ప్రమాణాలతో టైల్స్‌ను అన్ని వర్గాల వారికి అందుబాటులో ఆంధ్రప్రదేశ్‌లో తొలి టైల్స్ అండ్ శానిటరీ షాఫ్ అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందని ఎండీ ఉస్మాన్ తెలిపారు.

## "ఆనంద పాఠశాల"గా రాయపూడి యం.పి.పి.ఎస్



**రాజధాని వార్తలు, రాయపూడి :** వసంత పంచమి సందర్భంగా విద్యావికాస సమితి వారు గుంటూరులోని హిందూ కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ అమరావతి రోడ్ నందు రాష్ట్రస్థాయి ఉత్తమ పాఠశాలల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. వినూత్న ప్రయోగాలను ప్రదర్శించినందుకు గాను మా పాఠశాల యం.పి.పి.ఎస్ మెయిన్ రాయపూడిని "ఆనంద పాఠశాల" పురస్కారంనకు ఎంపిక కాబడినది. ఈ పురస్కారంను విద్యావికాస సమితి జాతీయ కార్యదర్శి "అతుల్ కొఠారి" చేతుల మీదగా దడిగి సుబ్బారావు ఎల్.ఎఫ్. ఎల్.హెచ్.యం కు అందించారు.

# రైతు నిరసన

- టమోటాకు గిట్టుబాటు ధర రాక రోడ్డుపై పారబోసిన రైతన్న!
- బాక్సును రూ.40కే కొంటామనడంతో మనస్తాపం



**ప్రకాశం :** పంట వేసిన దగ్గరి నుంచి చేతికి వచ్చేవరకూ రైతుల కష్టం అంతా ఇంతా కాదు. అయినా పంట చేతికి రాగానే మద్దతు ధర లేకపోవడం, దళారుల జోక్యంతో తక్కువ ధరకే పంటలను తెగనమ్ముకోవాల్సి వస్తుంది. కొన్నికొన్నిసార్లు అసలు వేసిన పంటకు గిట్టుబాటు ధర కూడా దొరకదు. తాజాగా ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లాలో అలాంటి ఘటనే చోటుచేసుకుంది. తాము సాగుచేసిన టమోటా పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో ఓ రైతు తన పంటను రోడ్డుపై పారబోసి నిరసన తెలియజేశారు. జిల్లాలోని గిద్దలూరు మండలం దిగువమెట్టకు చెందిన రైతు ఆదిపుల్లయ్య ఈసారి రెండున్నర ఎకరాలను కౌలుకు తీసుకుని టమోటా పంటను సాగు చేశారు. ఇందుకోసం ఎకరాకు రూ.30,000 పెట్టుబడి పెట్టారు. పంటను మార్కెట్ కు తీసుకురాగా, బాక్సును కేవలం రూ.40కే కొంటామని అక్కడి వ్యాపారులు స్పష్టం చేశారు. దీంతో మనస్తాపానికి లోనైన ఆదిపుల్లయ్య తన పంటను రోడ్డుపై పారబోసి నిరసన తెలియజేశారు. ఒక్కో బాక్సును మార్కెట్ కు తీసుకురావడానికే రూ.20 ఖర్చువుతుందనీ, ఇంత తక్కువ ధరకు అమ్మాల్సి వస్తే తామెలా బతకాలని ఆదిపుల్లయ్య ప్రశ్నించారు.

# జగన్ లండన్ పర్యటనకు అనుమతి



**హైదరాబాద్ :** వైసీపీ అధినేత జగన్ లండన్ లోని తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. గత నెలలోనే జగన్ లండన్ వెళ్లేందుకు సిద్దమయ్యారు. అయితే, రాజకీయంగా అనూహ్య పరిణామాలు చోటు చేసుకోవటంతో ఆయన తన పర్యటన వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఎన్నికల ప్రచారం మొదలు పెట్టే ముందు జగన్ లండన్ పర్యటనకు వెళ్ల నున్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ సంస్థలో చదువుతున్న తన కుమార్తెను కలిసేందుకు బ్రిటన్ వెళ్లేందుకు అనుమతించాలని అభ్యర్థిస్తూ ఆయన పిటిషన్ వేశారు. దీంతో ఈనెల 18 నుంచి మార్చి 15వ తేదీ మధ్య 10 రోజులపాటు ఆయన లండన్ లో పర్యటించేలా.. ఏడాది కాలపరిమితికి పాస్‌పోర్టు జారీచేయాలని పాస్‌పోర్టు అధికారులను కోర్టు ఆదేశించింది. లండన్‌లో పర్యటించే ప్రదేశాలు, ల్యాండ్ ఫోన్, సెల్ నంబర్, ఈ-మెయిల్, ఫ్యాక్స్ నంబర్ తదితర వివరాలను కోర్టుతోపాటు సీబీఐ అధికారులకు సమర్పించాలని షరతు పెట్టింది. ఇప్పటికే ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ అభ్యర్దుల విషయంలో జనగ్ ఓ నిర్ణయానికి వచ్చేసారు. అయితే, ఇతర పార్టీల నుండి వచ్చే కీలక నేతల వ్యవహారంలో ఆచి తూచి వ్యవహరిస్తున్నారు. ఎవరు వస్తారనే విషయంలో స్పష్టత వస్తే ఇక అభ్యర్దులను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ విడదల అయ్యే అవకాశం ఉంది. దీంతో.. ఈ లోగానే లండన్ పర్యటన ముగించుకొని ఆ వెంటనే అభ్యర్దుల ను ప్రకటించే యోచనలో జగన్ ఉన్నారు.

## తెలుగుదేశం పార్టీ ఓ డ్రామా కంపెనీ : కన్నా



**రాజధాని వార్తలు, గుంటూరు :** తెలుగుదేశం పార్టీలా పూటకో వేషం, గంటకో మాట మావల్ల సాధ్యం కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నాక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. 'అదో డ్రామా కంపెనీలాంటి పార్టీ, దాని అధినేత చంద్రబాబు రోజుకో వేషం వేస్తారు' అని విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకున్న చంద్రబాబునాయుడు ఏపీకి వచ్చేసరికి లేదంటున్నారంటే వారి తీరు అర్థం చేసుకోవాలని చెప్పారు. ఒకప్పుడు ప్రత్యేక హోదా వద్దు, ప్యాకేజీ ముద్దు అని అసెంబ్లీలో తీర్మానాలు చేశారని, తాజాగా ఆ తీర్మానాలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించారని చెప్పారు. చంద్రబాబుకు చేతన్కైతే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ఏపీలో అధికారం సాధించడమే లక్ష్యంగా ఒంటరిగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈనెల 21న రాజమండ్రిలో రాష్ట్ర ముఖ్యనేతలతో అమిత్ షా సమావేశమవుతారని చెప్పారు.

## చీరల కోసం తొక్కిసలాట



**సిద్ధిపేట :** ఆఫర్ల పేరుతో సిద్ధిపేట పట్టణంలో ఓ వస్త్ర దుకాణం మహిళల ప్రాణాల మీదకు తెచ్చింది. పది రూపాయలకే చీర అని ప్రకటించడంతో సీఎంఆర్ షాపింగ్ మాల్‌కు మహిళలు భారీగా తరలివచ్చారు. సిద్ధిపేట చుట్టుపక్కల నుంచి కూడా మహిళలు తరలిరావడంతో వీరిని అదుపు చేయడం దుకాణం నిర్వాహకులకు కష్టంగా మారింది. చవక ధరలో లభ్యమయ్యే చీరలను దక్కించుకునేందుకు మహిళలు పోటీ పడటంతో తొక్కిసలాట చోటు చేసుకుంది.ఈ ఘటనలో 20 మంది మహిళలకు గాయాలయ్యాయి. కొంతమంది మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. ఓ మహిళ నుంచి దుండగులు 5 తులాల బంగారం చోరీ చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. కాగా, సరైన ఏర్పాట్లు చేయకుండా తమను ఇబ్బంది పెట్టిన షాపింగ్ మాల్ నిర్వాహకులపై మహిళలు మండిపడుతున్నారు. మీ వ్యాపారం కోసం మా ప్రాణాలతో చెలగాటం ఆడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి విజయ ఎలక్ట్రానిక్స్ అధినేత దాసరి జై రమేష్



హైదరాబాద్ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డితో విజయ ఎలక్ట్రానిక్స్ అధినేత దాసరి జై రమేష్ భేటీ అయ్యారు. హైదరాబాద్ లోటస్ పాండ్‌లో దాసరి జై రమేష్ ఇవాళ వైయస్ జగన్‌ను కలిశారు. ఆయన వెంట దగ్గుపాటి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాష్, పార్టీ సీనియర్ నేత ఉమారెడ్డి వెంకటేశ్వర్లు, ఎంపీ విజయసాయి రెడ్డి తదితరులు ఉన్నారు. వైయస్ జగన్ వాగ్దానాలు చేసి ఆయనతో కలిసినడవటానికి నిర్ణయించుకున్నానని దాసరి జై రమేష్ అన్నారు. గతంలో విజయవాడ ఎంపీ సీటు, గన్నవరం సీటు ఇస్తామని చంద్రబాబు చెప్పి మోసం చేశారని అన్నారు. టీడీపీకి కష్టకాలంలో ఎంతో సాయం చేశానని చంద్రబాబుకు ముఖ్యమంత్రి అవ్వటానికి వ్యక్తిగతంగా సాయం చేశానని అన్నారు. ఒక్క పైసా అయినా నేను లబ్ధి పొందానని చూపిస్తే దానికి జవాబు ఇస్తానని దాసరి అన్నారు. ప్రజాస్వామ్యంలో మాటకు విలువ ఉంటుందని జగన్ చేయగలిగితేనే హామీ ఇస్తున్నారని అన్నారు.

## ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో 175 సీట్లలో గెలుస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

మహిళలకు డబ్బులు ఇచ్చాం. అన్ని నియోజకవర్గాలకు తాగునీరు సాగునీరు అందజేస్తున్నాం. కాబట్టి రాబోయే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీనే అధికారంలోకి రాబోతోంది' అని జోస్యం చెప్పారు. విజయవాడలో భవనీపురం వాటర్ వర్క్స్ దగ్గర ఈరోజు నిర్వహించిన 'జలసిరికి హారతి' కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టిసీమ ప్రాజెక్టు దండగ అని చెప్పిన ఏకైన వ్యక్తి జగనేనని విమర్శించారు. ఏపీ, తెలంగాణల మధ్య చిచ్చు పెట్టేందుకు ఏపీ ప్రతిపక్ష నేత యత్నిస్తున్నారని ఆరోపించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ కు చెందిన పులివెందుల నియోజకవర్గంలో కూడా టీడీపీనే విజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని స్పష్టం చేశారు. సీమకు నీళ్లు ఇచ్చే పట్టిసీమ ప్రాజెక్టును వ్యతిరేకించిన జగన్ ను ప్రజలు నిలదీయాలని సూచించారు.

# బైక్ విన్యాసాల భామ

**జీవితంలో ఏదైనా సాధించాలంటే ధైర్యం ఉండాలి. అప్పుడే మహిళలు ఏరంగంలోనైనా రాణించగలుగుతారు. ఎప్పుడూ తమని తాము తక్కువగా అంచనా వేసుకోకూడదు అంటారు బైక్, కార్ స్టంట్లు చేసే రెహాఖాన్. ఆమె చేసే విన్యాసాలను ప్రేక్షకులు శ్వాస బిగబట్టి మరీ చూస్తారు.. భయానికి ఆవల మాంఛి థ్రిల్ ఉంటుందంటారామె.**





ఆమె

హైదరాబాద్ ఎగ్జిబిషన్‌లో వెల్ ఆఫ్ డెత్ (మృత్యు బావి)లో ఒళ్లు గగుర్పొడిచే బైక్ విన్యాసాలతో సందర్శకులు ఆకర్షిస్తుంది 28 ఏళ్ల రెహాఖాన్. పురుషులకే పరిమితమైన ఈ అడ్వంచెర్ గేమ్‌ను ఒక మహిళ విజయవంతంగా ప్రదర్శించడం సామాన్య విషయం కాదు. నాలుగు బైక్‌లో బావి గోడలపై చేసే విన్యాసాలు ఏమాత్రం ఆదమరచినా ప్రమాదానికి లోనవుతారు. (యూట్యూబ్‌లో ఆమె విన్యాసాలు తిలకించ వచ్చు)

రెహానా ఉత్తరప్రదేశ్‌లోని ఈటా జిల్లా..ఇంటర్ వరకు చదువుకున్న ఆమెకు 20 ఏళ్లలోనే పెళ్లిచేశారు. పెళ్ళయిన తర్వాత అందరు మహిళలలాగానే సాధారణ గృహిణిలా గడిపింది. ఒక రోజు వారి ఊర్లో జరిగిన ఎగ్జిబిషన్‌కి ఆమె కుటుంబ సభ్యులతో కలసి వెళ్లింది. అక్కడ ఆమెను వెల్ ఆఫ్ డెత్ విన్యాసాలు చూసి అబ్బురపడింది. అయితే అందరూ మగవాళ్లే ఈ ఫీట్లు చేస్తున్నారు. అప్పుడే తనకు కూడా నేర్చుకోవాలనిపించిందని ఆమె తెలిపారు. ఇంట్లో ఆమె నిర్ణయం చెప్పినప్పుడు కుంటుంబ సభ్యులంతా వద్దని వారిస్తూ.. అది చాలా ప్రమాదకరమైన పనని హెచ్చరించారంటుంది రెహాఖాన్. అయితే భర్త రియాజ్ మాత్రం ఆమె ఆసక్తిని గౌరవించి నేర్చుకోవడానికి సహకరించారని చెప్పారు. రియాజ్ బైక్ స్టంట్లు నేర్పేవారి కోసం చాలా ప్రయత్నించగా, చత్తీస్‌గఢ్‌లో నేర్పుతారని తెలిసిందన్నారు. దీంతో అక్కడకు చేరుకొని సమీర్ వద్ద నెలరోజులపాటు నేర్చుకుని విన్యాసాలను ఆకళింపు చేసుకున్నానని రెహాఖాన్ వెల్లడించారు.

మొదటిసారి ప్రదర్శన ఇచ్చే ముందు చాలా భయమేసిందని, అయితే ప్రదర్శన విజయవంతం అవగానే మనసులో కలిగిన సంతోషం మాటల్లో చెప్పలేను. అది ఇప్పటివరకు మర్చిపోలేను అని సంతోషంగా తన మొదటి ప్రదర్శనను గుర్తుచేసుకున్నారు రెహానా. ఇప్పటివరకు చత్తీస్‌గఢ్, రాంచి, జార్ఖండ్, ఒడిశా, కోల్‌కొతాల్లో తన ప్రదర్శనలు కొనసాగించింది. ప్రతిరోజు ఈ ప్రదర్శనలను కొనసాగిస్తానని, బైక్, కార్ విన్యాసాలు జీవితంలో ఒక భాగంగా మారిపోయాయంటారు ఆమె.

4 నెలల గర్భిణిగా ఉన్నపుడూ తాను ఈ ప్రదర్శనలు ఇచ్చానని ఈ పనంటే తనకు చాలా ఇష్టమని రెహానా చెప్పారు. ఆమె కూతురుకు ఇప్పుడు అయిదేళ్ళు. ఆమె రోజుకు 8 నుండి 10 ప్రదర్శనలు ఇస్తున్నారు. ఒక్కో ప్రదర్శన దాదాపు 10 -15 నిమిషాలు సాగుతుంది. ఒక బైక్ విన్యాసమే కాకుండా, ఆమె కారుతో కూడా ఇలాంటి విన్యాసాలు చేస్తారు. భయాన్ని జయిస్తే ఏదైనా సాధించవచ్చని రెహానాఖాన్ నిరూపించింది. పెళ్లయినప్పటికీ, కుటుంబం... జీవితం అని సర్దుకుపోకుండా తాను అనుకున్న అతిక్లిష్టమైన పని నేర్చుకొని ఎంతోమంది అభిమానాన్నిచురగొంటున్నారు రెహానా. మా ఇంట్లో పెద్ద వాళ్ళంతా నేను చేసే పని చూసి 'మా పిల్లకు ఎంత ధైర్యమో' అని సంతోషపడతారు. మళ్ళీ ఇంత ప్రమాదకరమైన పని ఎందుకు చేస్తావని అంటారు. కానీ, భయం అవతలే గెలుపుంది కదా' అని నవ్వుతుందామె. నిత్యం ప్రదర్శనలు చేస్తూ ఉండే రెహానా మూడు నెలలకు ఓసారి ఇంటికి వెళ్లొస్తారు. పాపను చదువు కోసం అమ్మమ్మ ఇంటి వద్దే ఉంచారు.

మహిళలు ధైర్యంగా ఉండటంతోపాటు ఒకరిపై ఆధారపడకుండా నిలవాలి. అప్పుడే లింగ వివక్ష వంటి జాడ్యాలు తగ్గుతాయని రెహానా అన్నారు.

**- ఖాన్**




**దేశం అంత ఎక్కడ చూసినా ఒకటే చర్చ సి ఆర్ పి ఎఫ్ జవాన్లపై ఉగ్రదాడికి నిరసనగా తోట చంద్రశేఖర్ గారి ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ. శ్రీ తోట చంద్రశేఖర్ గారు మాట్లాడుతూ ఇలాంటి దాడులు అనైతికం అహేతికం అని పేర్కొన్నారు. మన వీర జవాన్లకు వారి కుటుంబాలకు దేశం ఎవత్తు ఒకే తాటి పైకి వొచ్చి సంగీభవం తెలియాయచేయలని పేర్కొన్నారు. ఈ సంఘటన తీవ్ర మనస్తాపానికి గురి చేసిందని ఏది ఏమైనా కేంద్ర ప్రభుత్వం మన సైనికులకు మనోధైర్యం నింపాల్సింది గా బావిస్తునం. ఇల్లాంటి పిరికి పందా చర్యలకు గట్టి సమాధానం చెప్పాలంటూ ఆయన డిమాండ్ చేశారు.**

**- కిరణ్ కుమార్ గుంటూరు**









# ఆనంద నగరాల సదస్సు చిత్రమాలిక











## కాలమ్

### పోగుపడ్డ సంపద..

9మంది కోటీశ్వరుల వద్దే సగం జనాభా సంపద..

– సంపద అంతా కొందరి వద్దే కేంద్రీకృతమవుతోంది.

– భారత్‌లో జనాభాలో 1% సంపన్నుల వద్ద 51.53% సంపద పోగుబడింది

– అంతర్జాతీయ హక్కుల సంస్థ 'ఆక్స్‌ఫామ్' నివేదిక

– దేశంలో అత్యంత ధనవంతుల్లో 1% మంది ఆదాయం 39% పెరగ్గా..

– దిగువ భాగంలో ఉన్న 99% వారి ఆదాయం మాత్రం 3 % మాత్రమే పెరిగింది

– ప్రపంచవ్యాప్తంగా బిలయనీర్ల ఆదాయం రోజుకు 2.5 బిలియన్ డాలర్లు పెరగ్గా..

– దిగువన ఉన్న పేదల ఆదాయంలో మాత్రం 11% క్షీణించింది

– మానవజాతిలో సగం పేదవారి(13.6 మిలియన్ ప్రజల) వద్ద ఉన్న మొత్తం ఆదాయం కేవలం 29 ధనికుల వద్ద పోగుబడింది

– గత ఏడాది భారత్‌లో కొత్తగా 18 మంది బిలియనీర్లు పుట్టుకువచ్చారు.

– వీరి చేరికతో మొత్తం బిలియనీర్ల సంఖ్య 119కి చేరింది

– దేశంలోని 1% ఉన్న అత్యంత సంపన్నులు వారి సంపదపై కేవలం 0.5% మాత్రమే అదనంగా పన్ను చెల్లించడం కొసమెరుపు.

## అమ్మకు వందనం



**రాజధాని వార్తలు, రాయపూడి :** అమ్మకు వందనం కార్యక్రమంను ఎంపీపీఎస్ (మెయిన్), రాయపూడి నందు ఘనంగా నిర్వహించాము. ఈ కార్యక్రమంను ఎల్. ఎఫ్. ఎల్. హెచ్.యం దడిగి సుబ్బారావు అమ్మ అన్నది ఒక కమ్మని మాట" అనే పాటతో ఉత్సాహవంతంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖాధికారి శ్రీ" గద్దె కోటేశ్వరరావు మాట్లాడుతూ అమ్మ యొక్క గొప్పదనంను పిల్లలకు వారి పట్ల గల బాధ్యతను వివరించారు. తదుపరి వై.ఆంజనేయశర్మ తల్లిదండ్రులను, వారి పిల్లలను శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్ఛారణతో ఆశీర్వాదాలు అందించారు. తదుపరి మెడికల్ షాపు ఓనర్ తాడిపినేని. రాఘవయ్య కుమారుడు, నరసింహారావు ప్రసాద వితరణ గావించారు. తదుపరి పాఠశాల ఉపాధ్యాయులు వి.ప్రసాద్, ఎన్.సుజాతకుమారి, కే.శేషారత్నం, టి.నాగజ్యోతి విచ్చేసిన తల్లులకు పసుపు,కుంకుమ పూలు, తాంబూలాలు అందజేశారు. పిల్లలు వారి తల్లులకు పాదాభివందనం చేశారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ఆశీర్వదించారు. ఇంకా ఈ కార్యక్రమంలో యంఆర్‌సీ అకౌంటెంట్ అనిల్ స్నేహహస్తాలు కో ఆర్డినేటర్ గిరిబాబు ఎ.ఎన్.ఎమ్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## నోట్ల తగ్గుదలతో ఆర్థిక స్తబ్దత

**ముంబై :** దేశంలో నోట్ల చెలామణి తగ్గడంతో చాలా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థల కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఒక రిపోర్టులో విశ్లేషించింది. ఫిబ్రవరి 1 నాటికి దేశంలో రూ.20.6 లక్షల కోట్ల కరెన్సీ సర్క్యులేషన్‌లో ఉంది. 2016 నవంబర్ 9 నాటికి .. అంటే నోట్ల రద్దుకు ముందు నగదు చెలామని రూ.17.97 లక్షల కోట్లుగా ఉంది. నోట్ల రద్దు తర్వాత ఇందులోని 86 శాతం నగదు చెల్లకుండా పోయింది. తమ అంచనా ప్రకారం ప్రస్తుత కరెన్సీ ఇన్ సర్క్యులేషన్ (సిఐసి)లో 1.5 లక్షల కోట్ల తగ్గుదల ఉందని ఎస్‌బిఐ గ్రూపు చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ సౌమ్య క్రాంతి ఘోష్ ఈ రిపోర్టులో పేర్కొన్నారు. కాగా నగదు ఏ రూపంలో అయినా అనాధికారికంగా ఒకే సారి తిరిగి వ్యవస్థలోకి రావడం కూడా సరైంది కాదన్నారు. ఈ రిపోర్టు అంచనా ప్రకారం.. ప్రస్తుత వృద్ధి రేటు పరిణామాల నేపథ్యంలో 2019 మార్చి ముగింపు నాటికి రూ.22.45 లక్షల కోట్ల నగదు చెలామణిలోకి రావాల్సిన అవసరం ఉందని గోష్ పేర్కొన్నారు. అయితే ఇందులో రూ.20.9 లక్షల కోట్లు మాత్రమే వచ్చే అవకాశం ఉన్నట్లు గోష్ అంచనా వేశారు. ఆర్థిక వ్యవస్థలో సరిపడ పెద్ద నోట్లు (రూ.2,000) సరిపడ అందుబాటులో లేకపోవడం కూడా దీనికి ఓ కారణమని విశ్లేషించారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్నాటక లాంటి పెద్ద రాష్ట్రాల ఆదాయ గమనం జాతీయ సగటు కంటే తక్కువగా ఉందని ఈ రిపోర్టు పేర్కొంది. మరోవైపు చత్తీస్‌ఘడ్, మధ్య ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, జమ్మూ, కాశ్మీర్‌లలో ఆదాయ ప్రవాహం జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉంది. ఆదాయ ప్రవాహం తగ్గడం వల్ల ఆర్థిక వ్యవస్థ పనితీరు తిరిగి జారిపోయే అవకాశం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ ఒత్తిడిలోనే ఉందని ఈ రిపోర్టు విశ్లేషించింది.

## బీహార్ జర్నలిస్ట్ లకు పెన్షన్

**బీహార్ :** రిటైరైన జర్నలిస్ట్ లకు నెలకు 6వేల రూపాయల పెన్షన్ ఇచ్చేందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రభుత్వం నిర్ణయించింది. 60సంవత్సరాల వయసు నిండి, ఒకే సంస్థ లోగాని, అంతకు మించి ఎక్కువ సంస్థల్లో గాని, కనీసం 20 సంవత్సరాలు లేదా అంతకు మించి ఎక్కువ పాత్రికేయ సర్వీస్ కలిగిన జర్నలిస్టులు, ఈ పెన్షన్ కు అర్హులు. ఎడిటర్, సబ్ ఎడిటర్, రిపోర్టర్, ఫోటోగ్రాఫర్, వంటి అన్ని కేటగరీ ల పాత్రికేయులు, దిన,వార,మాస పత్రికలు, ఛానళ్ళు,పోర్టల్ లలో పనిచేసే వారందరూ దీనికి అర్హులు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి ఈ పథకం అమలు లోకి వస్తున్నది. పెన్షన్ పొందుతూ జర్నలిస్ట్ మృతి చెందితే జీవిత భాగ స్వామి కి నెలకు మూడు వేలు రూపాయలు చొప్పున పెన్షన్ ఇస్తారు. బీహార్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఈ పథకాన్ని స్వాగతించింది.



గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 50 వ వార్డ్ నెహ్రూనగర్ 4వ లైన్‌లో పట్టణ పేదరిక నిర్మూలూన సంస్థ -మెప్మా వారి ఆధ్వర్యంలో ఉచితంగా 3 నెలలు పాటు శిక్షణా పొందిన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ గుంటూరు ఈస్ట్ ఇంచార్జ్ మద్దాలి గిరిగారు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ దాసరి రాజా మాస్టర్ గారు,షౌకత్ గారు పాల్గొన్నారు.

- కిరణ్ కుమార్ గుంటూరు



శ్రీ తోట చంద్రశేఖర్ గారి ప్రచార రథాలు. సెర వేగంగా మొదలవుతున్న రాజకీయ చిత్రాలు. జనసేన పార్టీ గుంటూరు వెస్ట్ నందు సర్వం సిద్ధం చేసుకుంది. ఇంకా మిగిలింది నోటిఫికేషన్ అన్నట్లు గా జనసేన నాయకులు కనపడుతున్నారు.

- కిరణ్ కుమార్ గుంటూరు



ఈ నెల 17న ఏలూరు లో జరగబోయే బీసీ మహా సభకు సంబంధించి ప్రెస్ మీట్ మరియు గోడ పత్రికను ఆవిష్కరించిన వైఎస్సార్సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ చంద్రగిరి యేసు రత్నం గారు , గుంటూరు పార్లమెంటరీ అధ్యక్షులు శ్రీ లేళ్ళ అప్పిరెడ్డి గారు , ఎమ్మెల్యే ముస్తఫా గారు మరియు బీసీ నేతలు

- కిరణ్ కుమార్ గుంటూరు

# రాఫెల్ గుట్టు 'ది హిందూ' రట్టు



**రాఫెల్ అవినీతిపై కాంగ్రెస్ వెనక్కి తగ్గడం లేదు. రాహుల్ వన్నీ అబద్దాలని, మోడీ ఒప్పందం మూలంగా వేల కోట్లు ఆదా అయ్యాయని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఢంకా బజాయించి చెబుతోంది. అయితే 'ది హిందూ' ఆంగ్ల దిన పత్రిక మాజీ ఎడిటర్ రాఫెల్ ఒప్పందంలో అవినీతిపై పక్కా ఆధారాలను ఆ పత్రికలో ప్రచురించడంతో కాంగ్రెస్‌కు మరో ఆయుధ దొరికినట్లయింది.**



ఆ పత్రిక కథనం ప్రకారం రాఫెల్ యుద్ధ విమానాల కోసం భారత్-ఫ్రాన్స్ మధ్య కాలంలో జరుగుతున్న సమయంలో ప్రధాన మంత్రి కార్యాలయం జోక్యం చేసుకుంది. ఒకవైపు రక్షణ శాఖ ప్రతినిధులు చర్చలు జరుపుతుండగానే సమాంతరంగా పీఎంఓ ఫ్రాన్స్ ప్రతినిధులతో చర్చలు ప్రారంభించింది. ఇది నిబంధనలకు పూర్తి విరుద్ధం. ఈ జోక్యానికి రక్షణ శాఖ గట్టిగా అభ్యంతరం వ్యక్తం చేసింది. పీఎంఓ జోక్యం చేసుకుని సమాంతరంగా చర్చలు జరపడం వల్ల రక్షణ శాఖ, భారతదేశం చర్చల బృందం సంప్రదింపుల స్థితిని బలహీనపరుస్తుంది అని రక్షణ శాఖ 2015 నవంబరు 24న ఒక నోట్‌ను తయారుచేసి నాటి రక్షణ మంత్రి మనోహర్ పారిక్కర్ దృష్టికి తీసుకువెళ్లింది. "ఫ్రాన్స్ ప్రభుత్వాధికారులతో మేము చర్చలు జరుపుతుండగా ఇందులో భాగస్వామ్యంలేని అధికారులు సమాంతర చర్చలు జరపకుండా నివారించాలి" అని తెలిపామని రక్షణశాఖ పేర్కొంది. ఒక వేళ జరుగుతున్న చర్చల ఫలితంపై పీఎంఓకి విశ్వాసం లేకపోతే చర్చలకు సంబంధించిన నియమావళిని తిరిగి రూపొందించి పీఎంఓ కార్యాలయం నాయకత్వంలో తగిన స్థాయిలో చర్చలు జరపవచ్చునని కూడా రక్షణ శాఖ సూచించింది. **ది హిందూ పత్రికకు అందిన అధికార పత్రాల ప్రకారం పీఎంఓ తీసుకున్న వైఖరిని రక్షణ మంత్రిత్వ శాఖ తీవ్రంగా నిరసించింది.** రక్షణ శాఖ పేర్కొన్న దానికి ప్రభుత్వం చెప్పిన చర్చల బృందం సమాచారానికి పూర్తి వైరుద్యం ఉన్నది. అప్పటి రక్షణ శాఖ కార్యదర్శి మోహన్ కుమార్ ఇందుకు సంబంధించిన అధికారిక నొటేషన్ (సంకేత గుర్తు)ను తమ స్వహస్తంతో రాశారు. అందులో ఇలా ఉంది. "ఆర్ఎం దయచేసి పరిశీలించండి. అటువంటి చర్చలను పీఎంఓ మినహాయించడం మంచిది. మేము జరుపుతున్న చర్చలను క్షీణింపచేస్తాయి". రక్షణ శాఖ కార్యదర్శి వ్యక్తం చేసిన ధృడమైన వ్యతిరేకతను 2015 నవంబరు 24న డిప్యూటీ కార్యదర్శి (ఎయిర్-2) ఎస్కే శర్మ తయారుచేసిన నోట్‌లో నమోదుచేశారు. పధానమంత్రి కార్యాలయం సంయుక్త కార్యదర్శి శ్రీజావేద్ అష్రఫ్‌కి, ఫ్రాన్స్ రక్షణ శాఖ దౌత్య సలహాదారు లూయిస్ వర్సికి మధ్య 2015 అక్టోబరు 20న టెలిఫోన్ ద్వారా సంభాషణ జరిగింది. దీనిని అక్విజిషన్ మేనేజర్ (ఎయిర్), సంయుక్త కార్యదర్శి, రక్షణ శాఖ (అక్విజిషన్) డైరెక్టర్ జనరల్ ధృవీకరించారు. రక్షణ శాఖ నోట్ ప్రకారం, పీఎంఓ కార్యాలయం నిర్వహించిన సమాంతర చర్చలకు సంబంధించిన లేఖను ఫ్రాన్స్ చర్చల బృందం నాయకుడు జనరల్ స్టీఫెన్ రెబ్ 2015 అక్టోబరు 23న రక్షణశాఖకు అందించారు. రక్షణ శాఖ, ఈ లేఖను పీఎంఓ దృష్టికి తీసుకువెళ్లింది. రాఫెల్‌పై కేసు దాఖలు కావడంతో 2018లో అక్టోబరులో కేంద్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించిన సీల్లు కవరును సుప్రీంకోర్టుకు అందించింది. అందులో రాఫెల్ ఒప్పందంపై వైమానిక దళాల ఉప అధిపతి నాయకత్వంలో ఏడుగురితో కూడిన బృందం చర్చలు జరిపినట్టుగా భారత ప్రభుత్వం పేర్కొంది. ఈ చర్చలలో పీఎంఓ పాత్ర ఉన్నట్టు ఎక్కడా ప్రస్తావించక పోవడం గమనార్హం.

## హిందూ కథనంతో రాహుల్ మళ్లీ ధ్వజం



హిందూ కథనంలో రాఫెల్ ఒప్పందాన్ని ఓ వ్యూహాత్మక దోపిడీగా రాహుల్ అభివర్ణించారు. మోడీ ప్రభుత్వం ఒక్క రాఫెల్ ఒప్పందాన్నే కాదు...ప్రతి ఒక్క ఒప్పందాన్ని ఇలాగే చేసిందని నిందించారు. కేవలం ఒక్క వ్యక్తి ఇష్టాలకనుగుణంగానే మొత్తం ప్రక్రియ ముందుకు సాగుతోందన్నారు. మోడీ చెప్పిందే వేదంగా ప్రభుత్వంలో కొనసాగుతోందన్నారు. ఆయా మంత్రిత్వశాఖలు, సీనియర్ అధికారులు, నిపుణుల అభిప్రాయాలకు తావు లేకుండా పోతోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో రాహుల్‌తో పాటు యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, లోక్‌సభ, రాజ్యసభల్లో కాంగ్రెస్ పక్ష నాయకులు మల్లికార్జున ఖర్గే, గులాం నబీ ఆజాద్, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. రాఫెల్ ఒప్పందంపై అక్రమాలు ఒకదాని తర్వాత మరొకటి వెలుగు చూస్తున్నాయని రాహుల్ చెప్పారు.

### పార్లమెంటులో కాగ్ నివేదిక

చివరి రోజైన బుధవారం కాగ్ తన నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. యూపీఏ ప్రభుత్వానికి బీజేపీ ప్రభుత్వానికి మధ్య కుదుర్చుకున్న ఒప్పందానికి మధ్య వ్యత్యాసాన్ని కాగ్ నివేదించింది. ప్రస్తుత ఒప్పందంలో ధర రూ. 2.86 శాతం తక్కువగా ఉందని కాగ్ తెలిపింది. రాఫెల్ ఒప్పందంలో 14 పరికరాలతో ఆరు రకాల ప్యాకేజీలు ఉన్నాయని ఏడు పరికరాల కోసం ఒపపందం చేసుకున్న ధరలు హేతు బద్దమైన ధరల కంటే ఎక్కువగా ఉన్నాయని కాగ్ పేర్కొంది. అయితే యూపీఏ ప్రభుత్వం కంటే మోడీసర్కారు మూడు రెట్లు అధికంగా కొనుగోలుచేయడాన్ని కాగ్ నివృత్తి చేయలేదు. కొత్త ఒప్పందంలో 18 యుద్ధ విమానాలు 5 నెలల ముందే భారత్‌కు చేరతాయని, ఈ ఒప్పందం 2.86 శాతం తక్కువ ధరకే జరిగిందని కాగ్ తెలిపినంప్పటికీ గణాంకాలు వివరించలేకపోవడం అనుమానాలను కలిగిస్తుంది. అలాగే ప్రభుత్వ రంగ సంస్థ హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)ను కాదని అనిల్ అంబానీకి చెందిన అనుభవ రహిత రిలయన్స్ డిఫెన్స్‌ను ఒప్పందంలో భారత భాగస్వామిగా ఎందుకుందని కేంద్ర ప్రభుత్వానికి అక్షింతలు వేయకుండా కాగ్ మౌనం పాటించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈఒప్పందంలో ప్రధానమైన ధర,ఇతర కీలక అంశాలను కాగ్ పట్టించుకోలేదని,కాగ్ నివేదిక చౌకీదార్ ఆడిట్ రిపోర్టని రాహుల్ గాంధీ విమర్శించారు.

## చిదంబరం ఫైర్



తొలుత 126 విమానాలకు ఒప్పందం జరగ్గా, దానిని 36కు కుదించి డస్సాల్ట్ కంపెనీకి సాయం చేశారని మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం విమర్శించారు. ఆ తర్వాత పీఎంఓ సమాంతరంగా చర్చలు జరపగా, తాజాగా అవినీతి నిరోధక నిబంధనలను ఎత్తివేసిన విషయం బహిర్గతమైందన్నారు. రోజుకో కొత్త విషయం వెలుగు చూస్తుండటంతో ఒప్పందంలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు స్పష్టమవుతోందన్నారు. ఆయుధాల కొనుగోలు ఒప్పందం విషయంలో కీలక నిబంధనలను మార్చడంతోపాటు, ఎలాంటి పూచీకత్తు లేకుండానే డస్సాల్ట్‌కు అంత పెద్ద మొత్తంలో సొమ్ము ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. ఈ విషయంలో ఎలాంటి కఠిన నిబంధనలు లేకుండానే ప్రభుత్వం ముందుకు వెళ్లిందని చిదంబరం దుయ్యబట్టారు.

ఆర్థిక శాఖ కార్యదర్శిగా రాజీవ్ మహర్షి రాఫెల్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నారని, ఈ నివేదికపై తమకు విశ్వాసం లేదని ప్రతిపక్షాలు ముందుగానే ప్రకటించాయి. రాఫెల్‌పై మోడీ ప్రభుత్వం గత యూపీఏ ప్రభుత్వం కంటే మెరుగైన ఒప్పందం కుదుర్చుకననదని మొదటివాదన కాగా, రెండవది విమానాల సరఫాకు సంబంధించింది. నాడు రాఫెల్ ఒప్పందంపై చర్చలు జరిపిన రక్షణ శాఖ ఏడుదురు అధికారుల్లో ముగ్గురు అధికారులు బీజేపీ వాదనతో విభేదిస్తున్నారు. దీనికి సంబంధించిన అసమ్మతి లేఖను కూడా 'ది హిందూ' మరో కథనం ప్రచురించింది. భారత చర్చల బృందానికి చెందిన ముగ్గురు నిపుణులు ఇండియన్ కాస్ట్ అకౌంట్స్ సర్వీస్ సంయుక్త కార్యదర్శి స్థాయి అధికారి ఎంపీ సింగ్ (ధరల సహాయదారులు), ఏఆర్‌సూలే (ఫైనాన్షియల్ మేనేజర్) రాజీవ్ వర్మ, రాజీవ్ వర్మ (సంయుక్త కార్యదర్శి, కొనుగోలు వ్యవహారాల మేనేజర్) అసమ్మతి లేఖను ఆ పత్రిక ప్రచురించింది. 2015లో ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా మోడీ రాఫెల్ ఒప్పందంపై ప్రకటన చేయగా, 2016 సెప్టెంబరు 23న ఉభయ ప్రభుత్వాల మధ్య ఒప్పందంపై సంతకాలు జరగ్గా, దాని కంటే ముందే ఈ నిపుణులు అభ్యంతరాలను తెలుపుతూ ఎనిమిది పేజీల లేఖను రాశారు. ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రతిపాదించిన తుదిధర, ముందుగా నిర్ణయించిన బెంచ్ మార్క్ కంటే 55.6 శాతం ఎక్కువగానూ, కాంగ్రెస్ హయాంలో కుదుర్చుకున్న ఒప్పందంలో సమీకృత వ్యయం కంటే 5.3 శాతం అధికంగా ఉందని వారు వెల్లడించారు. కాంగ్రెస్ హయాంలో 18 విమానాలకు 48 నెలల గడువు ఉండగా, కొత్త ఒప్పందంలో 53 నెలల వ్యవధి ఉంది.

రాఫెల్ ఒప్పందంపై పార్లమెంటరీ సంయుక్త కమిటీ (బీపీసీ) దర్యాప్తునకు ఆదేశించకపోవడంతో అవినీతి, కుంభకోణంలో ప్రమేయం ఉన్న విషయాన్ని తెలుపుతోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయానికి అన్ని విధాల సహకరించిన అనిల్ అంబానీకి లబ్ది చేకూర్చడానికి ప్రధాని మోడీ రిలయన్స్ డిఫెన్స్ కంపెనీని ఒప్పందంలో భాగస్వామిని చేశారన్నది నిస్సందేహం. ఈ స్కామ్‌లో మోడీకి ప్రజలు ఏ విధంగా బుద్ధి చెబుతారో వేచి చూడాల్సిందే.

\- ఖాన్

## రాఫెల్ ఒప్పందంపై రాష్ట్రపతికి కాగ్ ఆడిట్ నివేదిక

### రేపు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం

**న్యూఢిల్లీ :** రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) తన ఆడిట్ నివేదికను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు సోమవారం సమర్పించింది. 36 యుద్ధ విమానాల కొనుగోలులో రూ.30 వేల కోట్ల కుంభకోణం జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశం పార్లమెంట్ ఉభయ సభలను కుదిపేయగా, అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం సాగుతోంది. కాగ్ ఆడిటర్ రాజీవ్ మెహ్రిషీ ఆడిట్ నివేదికను రాష్ట్రపతికి సమర్పించారు. రాఫెల్ ఒప్పందం జరిగినపుడు రాజీవ్ మెహ్రిషీ ఆర్థికశాఖ కార్యదర్శిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కాగ్ ఆడిట్ బాధ్యతల నుంచి రాజీవ్ తప్పుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే డిమాండు చేసింది. కపిల్ సిబల్ రెండుసార్లు రాజీవ్‌ను కలసి రాఫెల్ ఒప్పందంలో అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ చేపట్టాలని డిమాండు చేశారు. కానీ, అదేమీ పట్టించుకోకుండా రాజీవ్ మెహ్రిషీ నేతృత్వంలోని కమిటీ నివేదికను కోవింద్‌కు సమర్పించింది.

## దేశ ప్రయోజనాలకు పాతర : మాయావతి



రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంలో ప్రధాని మోడీ దేశ ప్రయోజనాలు, నిజాయితీని విస్మరించారని బీఎస్పీ చీఫ్ మాయావతి విమర్శించారు. ఒప్పందంలో అవినీతి నిరోధక నిబంధనలను తొలగించటం శోచనీయమన్నారు. యుద్ధ విమానాల ఒప్పందంలో భారీగా అవినీతి జరిగినా, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు మోడీకే వత్తాసు పలుకుతున్నాయని తీవ్రంగా తప్పుపట్టారు.

## రెచ్చిపోతున్న ఆర్జీవీ



లక్ష్మీ పార్వతి కోణంలో ఎన్టీఆర్ కథను తెరపై ఆవిష్కరిస్తున్నానని ఆర్జీవీ ఇదివరకూ ప్రకటించారు. అసలైన ఎన్టీఆర్ జీవిత కథ ఇదే అంటూ తాను చెప్పిందే చేసి చూపిస్తున్నాడు. ఇది కుటుంబ కుట్రల కథ అంటూ పోస్టర్లపైనే ముద్రించిన వర్మ తన మొండి పట్టుదల ఎలాంటిదో ట్రైలర్ తోనే చూపించాడు. లక్ష్మీస్ ఎన్టీఆర్ ట్రైలర్ యూట్యూబ్ లో జెట్ స్పీడ్ తో దూసుకుపోయింది. సాధారణ జనంలో ఎంతో ఆసక్తి పెంచింది ఈ ట్రైలర్. సరిగ్గా ఏపీ ఎన్నికల ముందు లక్ష్మీస్ ఎన్టీఆర్ ప్రకంపనాలు ఎటు దారి తీస్తాయోనన్న ఆందోళన టీడీపీ వర్గాల్లోనూ మొదలైంది. ఒక రియల్ స్టోరీని అంతే ఒరిజినాలిటీతో చూపిస్తున్న ఆర్జీవీ ఈ సినిమా ప్రమోషన్స్ కి రాజకీయాల్ని... అవతలివారిని తెలివిగా ఉపయోగించుకుంటున్న సంగతి తెలిసిందే. టైమ్ చూసి టైమింగ్ తో ఇరకాటంలో పెట్టేస్తూ.. పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడమే కాకుండా అప్పుడప్పుడు ఫన్ తో కూడుకున్న ఛమక్కులతోనూ తన సినిమాకి ప్రచారం చేసుకుంటున్నాడు ఆర్జీవీ. తాజాగా ఓ ఫోటోని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన ఆర్జీవీ దానికి ఆసక్తికరమైన కామెంట్లను పోస్ట్ చేశారు.

ఈ ఫోటోలో లక్ష్మీస్ ఎన్టీఆర్ నిర్మాత రాకేష్ రెడ్డి ఉన్నారు. నవ్వుతున్న వ్యక్తి ఆయనే. ఆ పక్కనే మధ్యలో అతడి స్నేహితుడు ఉన్నారు. కానీ ఆ చివరిలో కుడివైపుగా ఉన్నది ఎవరో నాకు తెలీనే తెలీదు అంటూ ఆర్జీవీ ఫన్ క్రియేట్ చేశారు. అక్కడ ఉన్నది వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్న సంగతి అందరికీ తెలుసు. ఈ ఫోటో లీక్స్‌తో ఆర్జీవీ అనవసరమైన సందేహాల్ని రాజేసారు. ఈ ఫోటోని షేర్ చేయడం వెనక లాజిక్ ఏంటో? ఫన్ కోసమేనా? లేక దీనిని పబ్లిసిటీ కోసమే వాడేస్తున్నాడా? అన్నది తేలాల్సి ఉంది. ఆ అపరిచితుడు ఎవరో మాకు తెలుసు. ఆయన్ని యాత్ర సినిమాలో చూశాం.. అంటూ నెటిజనులు ఎంతో ఫన్నీగా వర్మకు సామాజిక మాధ్యమాల్లో ఆన్సర్ చేస్తున్నారు.

## జవాన్ కుటుంబాలకు దేవరకొండ సాయం



**హైదరాబాద్:** పుల్వామాలో సీఆర్పీఎఫ్ జవాన్లపై జరిగిన ఉగ్రదాడిని సినీ ప్రముఖులు తీవ్రంగా ఖండించారు. అమర జవాన్ల త్యాగాలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని వారికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ దాతృత్వం చాటుకున్నారు. జవాన్ల కుటుంబాల కోసం 'భారత్ కే వీర్' కింద ఆర్థిక సాయం అందించారు. 'వారు మన కుటుంబాలను రక్షిస్తున్నారు. ఇలాంటి విపత్కర సమయంలో జవాన్ల కుటుంబాలకు మనం అండగా నిలవాలి. సైనికుల జీవితాలను సాయంతో వెలకట్టలేం. కానీ మనవంతు సహకారం అందిద్దాం. నా వంతు సహకారం అందించా. మనమంతా కలిసి సాయం చేద్దాం' అని విజయ్ దేవరకొండ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా 'భారత్ కే వీర్' నిధికి విరాళం ఇచ్చిన పత్రాన్ని విజయ్ పోస్టు చేశారు. అయితే అందులో ఎంతమొత్తం విరాళం ఇచ్చారన్న దాన్ని మాత్రం విజయ్ తెలియనివ్వలేదు.

## ఎస్ఆర్ఎంలో వీర జవాన్లకు అశ్రు నివాళి



**రాజధాని వార్తలు, అమరావతి :** ఉగ్రవాదుల దాడిలో అశ్రువులు బాసిన భారత సైనిక వీరులకు అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అశ్రు నివాళులు అర్పించింది. యూనివర్సిటీ క్యాంపస్‌లో సమావేశమైన విద్యార్థులు, ఉద్యోగులు భారత వీర జవాన్లకు జోహార్లు అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రొవిసి. ప్రొ. డి. నారాయణరావు మాట్లాడుతూ, దేశ రక్షణలో భాగంగా నిరంతరాయంగా సరిహద్దుల్లో కాపలా కాస్తున్న సైనికులు దురదృష్టవశాత్తు ఉగ్రవాదుల బారిన పడి వీర మరణం పొందడం అత్యంత బాధాకరమన్నారు. మరణించిన సీఆర్‌పీఎఫ్ సైనికుల త్యాగం వృధా కాదన్నారు. వారి కుటుంబాలకు విశ్వవిద్యాలయం తరుపున ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నామన్నారు. ఈ క్యారక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్. డి. గుణశేఖరన్,డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ బీ. శివకుమార్, సీఎల్ఎం వెంకటాచలం, ఐటీ డైరెక్టర్ ప్రభాకర్ చౌదరి, హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాంక్లిన్, లయజన్ ఆఫీసర్ పూళ్ల రమేష్‌కుమార్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో మీ ముందుకు లఘు చిత్రం



**రాజధాని వార్తలు, విజయవాడ :** విజయవాడలోని మహాత్మా గాంధీ రోడ్‌లో ఉన్న వాస్టిట్యూడ్ మీడియా హౌస్‌లో ఒక లఘుచిత్ర నిర్మాణం ఫిబ్రవరి 16వ తేదీన ప్రారంభమయింది. ఇంకా పేరు పెట్టని ఈ లఘు చిత్రానికి దగ్గుపాటి పద్మాకర్ కథ అందించారు. ప్రధాన పాత్రలో గుమ్మడి నాగేశ్వరరావు నటిస్తుండగా, హీరో హీరోయిన్లుగా లవహయార్, ప్రజ్ఞ ఆలపాటి నటిస్తున్నారు. రెండురోజుల్లోనే నిర్మాణం పూర్తిచేసుకునే ఈ లఘు చిత్రానికి ఛాయా గ్రహణం పామర్తి హరీష్, మేకప్ అక్కినేని నాగేశ్వరరావు అందిస్తున్నారు. సహకార దర్శకుడుగా మాపాటి తిరుమలేశ్వరరావు, గుమ్మడి ప్రేమ్‌చంద్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ లఘు చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు యూట్యూబ్‌లో రాబోతుంది.

## అమరావతి సిటీ రైడ్- 2019



**రాజధాని వార్తలు, అమరావతి :** విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆదివారం ఉదయం 6 గంటలకు ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రారంభించనున్నారు. అమరావతి స్మార్ట్ అండ్ సస్టెయినబుల్ కార్పొరేషన్ లిమిటెడ్, ఏపీసీఆర్‌డీఏ, అమరావతి రన్నర్స్ ఆధ్వర్యంలో ఔత్సాహికులతో సైకిళ్లపై జరిగే అమరావతి సిటీ రైడ్- 2019 ఉద్దండరాయునిపాలెంలోని ఎక్స్‌పీరియన్స్ సెంటర్, సీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీస్, సెక్రెటేరియట్ అండ్ హెచ్‌వోడీ 5 టవర్ల రాఫ్ట్ ఫౌండేషన్, హైకోర్ట్, లేబర్ క్యాంప్, అంబేద్కర్ స్మృతి వనం, వెంకటపాలెం ఏడీసీ నర్సరీ మీదుగా కొండవీటి వాగు లిఫ్ట్ పంపింగ్ స్కీం వరకు సాగుతుంది. భవిత దిశగా రైడ్, మైళ్ల కొలది రైడ్.. చిరునవ్వులు చిందించు.. నినాదంతో రైతులకు వందనం తెలుపుతూ, అమరావతిపై ప్రేమాభిమనాలు చాటుతూ మార్గమధ్యంలో రాజధానిలో నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టులు, యూనివర్శిటీలు, వెలగపూడి సెక్రెటేరియట్ మీదుగా రైడ్ సాగుతుంది. అమరావతి సిటీ రైడ్- 2019లో పాల్గొనే వారు ఎవరి సైకిళ్లను వారే తెచ్చుకోవాల్సి ఉంటుంది.


## తెలుగు భాషకు అంతర్జాతీయ గౌరవం..

- అత్యంత వేగవంతమైన భాషగా రికార్డు!
- ఆస్ట్రియా ప్రొఫెసర్ గెర్ట్రాడ్ ఫెంక్-ఒక్జలాన్ పరిశోధన

ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా పేరుగాంచిన తెలుగు భాషకు మరో గౌరవం దక్కింది. ప్రపంచంలోనే వేగంగా మాట్లాడే భాషగా తెలుగు అగ్రస్థానంలో నిలిచింది. ఇక జపనీస్ రెండో స్థానంలో నిలవగా థాయ్, వియత్నమీస్ భాషలు జాబితాలో చిట్టచివరి స్థానం దక్కించుకున్నాయి. ఆస్ట్రియాలోని క్లాగెన్‌ఫర్ట్ యూనివర్సిటీలోని భాషా శాస్త్రం విభాగానికి చెందిన ప్రొఫెసర్ గెర్ట్రాడ్ ఫెంక్-ఒక్జలాన్ ఈ పరిశోధన చేపట్టారు. ఇందులో భాగంగా 51 భాషలు మాట్లాడే వేర్వేరు ప్రాంతాల వారిని ఎంచుకున్నారు. అనంతరం వీరికి 'నేను టీచర్‌కు థాంక్స్ చెప్పాను' 'స్ప్రింగ్ కుడివైపున ఉంది' 'తాతగారు నిద్రపోతున్నారు' వంటి పదాలను ఇచ్చి తమ సొంత భాషలోకి అనువాదం చేయమన్నారు. అనంతరం తాము అనువదించిన పదాలను సాధారణ వేగంతో చదవాలని సూచించారు. ఈ సందర్భంగా పరిశోధనలో పాల్గొన్నవారు అన్ని భాషల్లోకెల్లా తెలుగులోని ఆ పదాలను త్వరగా పలకగలిగారు. ఈ పరిశోధనలో తెలుగు తర్వాత జపనీస్ రెండో స్థానంలో నిలిచింది. ఇందులో భాగంగా వేర్వేరు భాషలు ఒక సమాచారాన్ని ఎంత బాగా అందిస్తున్నాయి అని గుర్తించే ప్రయత్నం చేశారు. సమాచారాన్ని వేగంగా అందించే భాషల్లో ఇంగ్లిష్ మొదటి స్థానంలో నిలవగా, ఫ్రెంచ్, జర్మన్ ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.



**తెనాలి పురపాలక సంఘం ఎన్ఎస్ఎస్ ఎమ్ హైస్కూల్ ప్రాంగణం నుందు నిర్మించిన కిచెన్ కమ్ డైనింగ్ ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఏపీఎన్నార్టీ అధ్యక్షుడు డాక్టర్ వేమూరి రవికుమార్. ఈ హాల్ నిర్మాణానికి శ్రీధర్ నన్నపనేని వితరణతో పాటు ఏపీ ప్రభుత్వం అందించిన 50గ్రాంట్‌తో నిర్మించారు. తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, నన్నపనేని రాజకుమారి తదితరులు ప్రారంభించారు. ఈ హాలును నన్నపనేని శంకర్రావుకు అంకితమిచ్చారు.**



**ఏపీఎన్నార్టీ విద్యావాహిని డివిజన్‌ను ఏపీఎస్‌సీసీ డైరెక్టర్ విజయ భాస్కర్ ప్రారంభించారు. దీంతో విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు కెరియర్ ప్లానింగ్‌ను అందిస్తారు. స్టడీ పాత్ కన్సెల్టెన్స్ సంస్థతో ఏపీ ఎన్నార్టీ కలిసి విదేశాల్లో అడ్మిషన్ల కొరకు , వీసా ప్రాసెసింగ్ కొరకు సహాయం అందిస్తారు.**

## ఉచిత అంతర్జాతీయ నైపుణ్య శిక్షణా తరగతులు

**రాజధాని వార్తలు, అమరావతి :** ఏపీఎన్నార్టీ ఆధ్వర్యంలో ఉచిత అంతరా జ్ఞతీయ నైపుణ్య శిక్షణా తరగతులు గుంటూరు మరియు రాజంపేట కేంద్రాలలో ఇటీవల ప్రారంభమయ్యాయి. నైపుణ్యతగల విదేశీ శిక్షకులతో 3 నెలలు పాటు ఇండస్ట్రియల్ ఎలెక్ట్రికల్ వర్క్, ఫార్మింగ్, సివిల్, ప్లంబింగ్ మరియు ఫైర్ ఫైటింగ్ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ 3 నెలల పాటు ఉచిత భోజనం మరియు వసతిని ఏపీఎన్నార్టీ వారు కల్పించనున్నారు. శిక్షణ అనంతరం అంతర్జాతీయ గుర్తింపుతో సర్టిఫికెట్ జారీ చేయనున్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com